సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 12 । జూలై । 2024



డిమాండ్లు పరిష్కరించాలి

సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం విశ్రాంత ఉద్యోగులు కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందించారు. వివరాలు 8లో ▸



మానవత్వం చాటారు..

సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు మానవత్వం చాటారు. ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. వివరాలు 8లో ▸



డబుల్ ఇళ్లు కేటాయించాలి

గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

దుబ్బాక సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నంతో చెరకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

దుబ్బాకటౌన్: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి గురువారం నగరంలో మంత్రి పొన్నంను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దుబ్బాక బస్‌డిపోలో బస్సులు సరిగా లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బస్సుల సంఖ్యను పెంచి సమస్యను తీర్చాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తక్షణం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెరకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దుబ్బాక మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు గట్టు శ్రీకాంత్, తదితరులున్నారు.

మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి


జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



స్వామి వారి సన్నిధిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధికి కృషి చేస్తానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం తన పుట్టినరోజు సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లికార్జున స్వామి కృపాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి, జెడ్పీటీసీ సిద్దప్ప, నాగిరెడ్డి, రసులాబాద్ మాజీ సర్పంచ్‌స్వామి, మెరుగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన పల్లా..



చేర్యాల(సిద్దిపేట): బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎర్రవల్లిలోని ఫాం హౌస్‌లో కలిశారు. జన్మదినాన్ని పురస్కరించుకుని కలిసిన పల్లాకు.. కేసీఆర్ శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నాచగిరి హుండీ ఆదాయం రూ.14.74లక్షలు



హుండీ కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వివిధ హుండీ కానుకల సొమ్మును బుధవారం లెక్కించారు. గడిచిన 72 రోజులలో భక్తులు వేసిన కానుకల ద్వారా రూ.14,74,097 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. సిద్దిపేట శరభేశ్వరాలయ ఈఓ రవి కుమార్ పర్యవేక్షణలో హుండీలను తెరిచారు. ఆలయ ముఖమండపంలో కొనసాగిన హుండీ కానుకల లెక్కింపులో గజ్వేల్ సత్యసాయి సేవా సమితి, హైదరాబాద్ భ్రమరాంభిక సేవా సమితి సభ్యులు, ఆలయసిబ్బంది సుధాకర్, పాండు, నరేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇంజనీర్స్ దినోత్సవాన్ని గురువారం జిల్లా నీటిపారుదల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అలీ నవాజ్ జంగ్ పుట్టిన రోజు జూలై 11న తెలంగాణ ఇంజనీర్స్ డేను నిర్వహించుకునే విషయం తెలిసిందే. జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఈఈ సాయిబాబా, డీఈఈ శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో అలీ నవాజ్ జంగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్‌లు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

సిద్దిపేటకమాన్: న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించిన టూటౌన్ ఏఎస్ఐపై చర్యలు తీసుకోవాలంటూ న్యాయవాదులు నిరసనకు దిగారు. గురువారం విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి సిద్దిపేట కోర్టు ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ముద్దాయికి అవసరం లేకపోయినా వైద్య పరీక్షలు చేయించడం ఎంతవరకు సమంజసమన్నారు. న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.



సిద్దిపేట కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

టూటౌన్ ఏఎస్ఐ హెడ్ క్వార్టర్‌కు అటాచ్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట టూటౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డిని జిల్లా హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేసినట్లు అదనపు డీసీపీ మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు రావడంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇదే ఘటనలో సీఐ ఉపేందర్‌పై ఆరోపణలు వచ్చినందున గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డిని విచారణ అధికారిగా నియమించామన్నారు. విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అదనపు డీసీపీ పేర్కొన్నారు.



బదిలీల బెంగ

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీల బెంగ పట్టుకుంది. జిల్లాలో ఉద్యోగులెవరిని కదిలించినా.. ఇదే ముచ్చట వినిపిస్తోంది. ఎవరెవరు సీనియర్లు, ఎక్కడికి బదిలీ అయ్యే అవకాశం ఉంది? ఇతరత్రా విషయాలపైనే చర్చించుకుంటున్నారు. ఎక్కడికి బదిలీ అవుతుందో అని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసిన విషయం తెలిసిందే. బదిలీల కోసం ఉద్యోగులు ఆప్షన్లు ఇచ్చుకునే గడువు శుక్రవారంతో ముగియనుంది.

– సాక్షి, సిద్దిపేట

ఉద్యోగుల్లో ఆందోళన

- ఎక్కడికి బదిలీ అవుతుందోనని గుబులు
- జిల్లా వ్యాప్తంగా సుమారు 8వేల మంది ఉద్యోగులు
- నేటితో ముగియనున్న ఆప్షన్ల ప్రక్రియ

సాధారణ బదిలీలు జరిగి ఆరేళ్లు కావస్తోంది. ఉద్యోగుల బదిలీలు 40 శాతానికి మించి చేయవద్దని ప్రభుత్వం నిబంధనలు విధించింది. దీంతో జూనియర్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే పలు శాఖలలో సీనియారిటీ జాబితాను ప్రకటించగా, మరికొన్ని ప్రకటించే అవకాశం ఉంది. బదిలీ ఉంటుందా? ఉండదా? అని చర్చించుకుంటున్నారు. కొందరు ఉద్యోగులు జిల్లా ఆవిర్భావం నుంచి ఇక్కడే తిష్ట వేశారు. రెవెన్యూ శాఖలో కొందరు ఉద్యోగులు వీఆర్‌ఏ నుంచి డిప్యూటీ తహసీల్దార్ వరకు ఒకే ప్రాంతంలో విధులు నిర్వర్తించారు.

అటెండర్ నుంచి..

ఈ బదిలీలు నాలుగు స్థాయిల ఉద్యోగులకు బదిలీలు జరగనున్నాయి. జిల్లా స్థాయిలో అటెండర్ నుంచి రికార్డు అసిస్టెంట్, టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్లు బదిలీలు కానున్నారు. రాజన్న జోన్ పరిధిలో (జోన్-3)కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాలు రానున్నాయి. సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్లు, గ్రేడ్-1, 2, 3 పంచాయతీ కార్యదర్శులు, హెచ్‌డబ్ల్యూవో, ఎంపీహెచ్‌ఏ(ఏఎన్‌ఎం), స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నిషియన్, వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగులు ఉండనున్నారు. మల్టీ జోన్-1 పరిధిలోకి కాళేశ్వరం, బాసర, రాజన్న, భద్రాద్రి జోన్‌లు రానున్నాయి.ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంపీవో, వ్యవసాయాధికారి, ఏఈలు, ఏఎస్‌డబ్ల్యూఓ, ఏటీఓ, మున్సిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ సివిల్ సర్జన్‌లతో పాటు జిల్లా అధికారులు మల్టీజోన్‌ల పరిధిలో బదిలీలు కానున్నారు.

వీరికి బదిలీ తప్పనిసరి..

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో సుమారుగా 8,314 మంది ఉద్యోగులు ఉండగా అందులో గెజిటెడ్ ఉద్యోగులు 1,050, నాన్ గెజిటెడ్ 6,138, నాల్గవ తరగతి ఉద్యోగులు 1,126 మంది ఉన్నారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు కోరుకున్న చోటుకు ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించారు. నాలుగేళ్లు ఒకే చోట విధులు నిర్వర్తించిన వారికి బదిలీ తప్పనిసరి చేసింది. రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారు బదిలీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా ప్రకటించారు.

శాఖల వారీగా కమిటీలు

బదిలీలు నిర్వహించేందుకు ప్రతి శాఖలో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్దేశించింది. మల్టీజోన్, జోనల్ స్థాయి ఉద్యోగుల కోసం కమిషనర్, అదనపు కార్యదర్శి, జాయింట్ డైరెక్టర్‌లుగా సభ్యులుగా కమిటీ ఏర్పడనుంది. జిల్లా స్థాయికి కలెక్టర్, అదనపు కలెక్టర్, సంబంధిత శాఖ అధికారి సభ్యులుగా ఉండనున్నారు.

జీఓ 317 బాధితులపై దృష్టి పెట్టాలి



బదిలీల కంటే ముందు జీఓ 317 బాధితుల సమస్య పరిష్కరించాలి. ఎందుకంటే జీఓ 317 ద్వారా చాలా మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొదట 317 వారిని సొంత జిల్లాకు బదిలీ చేసి తర్వాత ఖాళీలకు బదిలీలు చేపట్టాలి.

– విక్రంరెడ్డి, టీఎన్జీఓఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి



మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి..

గత ప్రభుత్వం అమలు చేసిన జీఓ 317 కారణంగా పలువురు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వర్గ కమిటీని నియమించింది. జీఓ 317తో జోన్, జిల్లా మారి ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల నుంచి ఆన్‌లైన్ ద్వారా వినతులను జూన్ 30వ తేదీ వరకు స్వీకరించారు. రెండేళ్ల నుంచి కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత ప్రాంతం ఆధారంగా ఆయా జిల్లాలకు బదిలీలు చేపట్టి తర్వాత సాధారణ బదిలీలు చేయాలని జీఓ317 బాధితులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

‘మత్తు’ వదిలిద్దాం

- గంజాయి నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- అధికారులకు దిశానిర్దేశం

సిద్దిపేటరూరల్: జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి నార్కో, కో ఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల రవాణా, క్రయ విక్రయాలను పూర్తిగా నివారించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డ్రగ్స్ నివారణ విషయంపై వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించాలని సూచించారు. విజేతలుగా నిలిచిన మొదటి ముగ్గురికి నగదు బహుమతి అందజేయాలన్నారు. తరగతి వారీగా యాంటి డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా బడికి రాని, బడి మానేసిన పిల్లల వివరాలను సేకరించి డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని డీఈఓకు సూచించారు. డ్రగ్స్ రవాణా, క్రయవిక్రయాల హాట్ స్పాట్‌లను గుర్తించి తనిఖీలు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో డ్రగ్స్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, దీనికై సంబంధించిన స్థలాన్ని అన్వేషించాలని ఆర్డీఓకు సూచించారు. డ్రగ్స్ కి ఆడిక్ట్ అయిన వారిని మామూలు మనిషి అయ్యేలా మార్చు తేవడం ఈ సెంటర్ ఉద్దేశమన్నారు. ఎక్కడైనా మత్తు చాక్లెట్లు, ఇతరత్రా పదార్థాల రూపంలో డ్రగ్స్ రవాణా జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 14446, 8712671111, 100 ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశం లో అదనపు డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీఓలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, ఎక్సైజ్ సూపరింటెంట్ శ్రీనివాసమూర్తి, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘మహిళా శక్తి’తో ఆర్థికంగా ఎదగాలి: కలెక్టర్

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న ‘మహిళా శక్తి’ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని, జిల్లాను ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళాశక్తి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పలు రకాల యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిలో పాల ఉత్పత్తి, కోళ్ల పెంపకం వంటివి ఉన్నాయన్నారు. మహిళలు యూనిట్ ఎంపిక చేసుకోవడమే ఆలస్యమని అన్నారు. మహిళలు ఆర్థికంగా రాణిస్తేనే దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. మహిళలు యూనిట్‌ను గ్రౌండింగ్ చేసుకుని ఆర్థికంగా ఎదుగుతూ జిల్లాను ఆదర్శవంతంగా మార్చాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం హరిబాబు, ఎస్‌బీఐ, యూబీఐ ,ఏపీజీవీబీ ఆర్‌ఎంలు అరుణ జ్యోతి, వికాస్, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ ప్రతీఒక్కరి బాధ్యత

- డీఎంహెచ్ఓ శ్రీనివాస్
- వైద్యాధికారులతో సమావేశం

సిద్దిపేటకమాన్: జనాభా నియంత్రణ అందరి బాధ్యత అని డీఎంహెచ్ఓ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో డీఎంహెచ్ఓ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక జనాభా వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లల పట్ల అసమానతలు పోవాలన్నారు. పిల్లల మధ్య రెండు నుంచి ఐదేళ్ల అంతరం పాటించాలని సూచించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా లక్కీ డిప్ ద్వారా ఎంపికైన ముగ్గురు దంపతులకు రూ.వెయ్యి నగదు బహుమతిని అందజేశారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాల్లో సేవలందించిన ఐదుగురు అధికారులు, సిబ్బందిని ప్రశంసా పత్రాలతో అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్లు రజని, విజయరాణి, శ్రీకాంత్, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

- జిల్లాలో సర్వైలెన్స్ బృందం
- పలు పీహెచ్‌సీల సందర్శన

సిద్దిపేటకమాన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర సర్వైలెన్స్ బృందం సభ్యులు వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం నుంచి రాష్ట్ర సర్వైలెన్స్ యూనిట్ బృందం మోహన్ కురువ, రాజీవ్, ముక్తేశ్వర్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి, ఎపిడమాలజిస్టు రాథోడ్‌సోపాన్‌తో కలిసి పలు పీహెచ్‌సీలను గురువారం సందర్శించారు. అంతకు ముందు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ శ్రీనివాస్‌తో నిర్వహించిన సమావేశంలో జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, ఇతర వివరాల గురించి అధికారులు చర్చించారు. అనంతరం ఇబ్రహీంనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పుల్లూరు, అంబేడ్కర్ నగర్ యూపీహెచ్‌సీ, సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించి ఆసుపత్రిలోని ఓపీ రికార్డులు, ల్యాబ్‌కు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల పట్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన వ్యాధులకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర కార్యాలయానికి అప్‌డేట్ చేయాలని సూచించారు.



ఇబ్రహీంనగర్ పీహెచ్‌సీని సందర్శించిన సర్వైలెన్స్ యూనిట్ బృందం

భూమికి భూమి ఇవ్వాల్సిందే..

ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల డిమాండ్

రాయపోలు(దుబ్బాక): భూమికి భూమి ఇవ్వాల్సిందేనని ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. రాయపోలు మండలం ఎల్కల్‌కు చెందిన భూ నిర్వాసితులు గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు ఊరంతా తిరిగి ర్యాలీ నిర్వహించారు. విషయం తెలుసుకుని గ్రామానికి వచ్చిన రెవెన్యూ అధికారులు వారికి నచ్చజెప్పేందుకు యత్నించినా వినలేదు. ప్రభుత్వం తమకు భూములు కేటాయిస్తేనే మేము కోల్పోయిన భూములలో నిర్మాణ పనులు జరగనిస్తామని స్పష్టం చేశారు.



ఎల్కల్‌లో భూ నిర్వాసితుల నిరసన



శాకాంబరిగా మహామైసమ్మ..

సిద్దిపేట పట్టణం ప్రశాంత్‌నగర్‌లో కొలువైన మహామైసమ్మ గురువారం శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసంలో భాగంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. – ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

ఎట్టకేలకు రైల్వేస్టేషన్ పనులు షురూ..

కొమురవెల్లి(సిద్దిపేట): ఎట్టకేలకు కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌లో ప్రముఖ పుణ్య క్షేత్రం కొమురవెల్లి మల్లన్న ఆలయం ఉంది. ఆలయ సమీపంలో రైల్వేస్టేషన్ నిర్మాణానికి లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌తో కలిసి పనులు ప్రారంభించారు. కానీ టెండర్లు పూర్తి కాకపోవంతో పనులు ముందుకు సాగలేదు. పత్రికలలో వచ్చిన కథనాలకు స్పందించిన రైల్వే అధికారులు ఎట్టకేలకు గురువారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ ఏర్పాటు చేసే ప్రదేశంలో జేసీబీతో చదును చేసి కొలతలు వేశారు. దీంతో స్థానిక ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైల్వేస్టేషన్ ఏర్పాటు చేసే ప్రదేశంలో భూమిని చదును చేస్తున్న రైల్వే సిబ్బంది

క్లుప్తంగా

మంత్రులను కలిసిన నథానియల్



దామోదరతో ఏజీపీ నథానియల్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ కోర్టు అడిషినల్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా నియమితులైన నథానియల్ రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం ఆయన న్యాయవాదుల బృందంతో హైదరాబాద్‌లో మంత్రులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట న్యాయవాదులు గోపాల కృష్ణ, గోపాల్ ముదిరాజ్, రాఘుంద్రనాయక్, శశికాంత్ మడపతి, మల్లేశం తదితరులు ఉన్నారు. ఏపీజీగా నియమించడానికి సహకరించిన సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పార్లమెంట్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు



వాహన తనిఖీలో ఎస్సై గంగరాజు

దుబ్బాకటౌన్: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే చర్యలు తప్పవని దుబ్బాక ఎస్సై గంగరాజు హెచ్చరించారు. గురువారం దుబ్బాక పట్టణంలో ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనపత్రాలు సరిగా లేని 19 మంది వాహనదారులకు రూ.3,500 జరిమానా విధించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై డ్రంకైన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని కోరారు. వాహనదారులు తమ వెంట వాహన ధ్రువపత్రాలను ఉంచుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సంగారెడ్డి టౌన్: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంగారెడ్డి జిల్లా కోర్ట్ నూతన ప్రభుత్వ న్యాయవాదిగా నియామకమైన వైద్యనాథ్ పాటిల్ అన్నారు. గురువారం సంగారెడ్డిలోని జిల్లా కోర్టులో న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ న్యాయవాదిగా విధులను పూర్తి స్థాయిలో నిర్వర్తించి న్యాయవాదులకు వృత్తి పరమైన సలహాలు సూచనలు అందజేస్తానన్నారు. అనంతరం న్యాయవాదులు సన్మానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మహమ్మద్ నిజాముద్దీన్ రషీద్, అంజయ్య, వెంకట రాములు, ప్రకాశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో రిమాండ్

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేర్యాల సీఐ శ్రీను గురువారం తెలిపారు. కొద్ది రోజుల కిందట మండలానికి చెందిన బాలికను వరంగల్ జిల్లా గీసుకొండ మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొండెపోగు మదన్‌బాబు అనే వ్యక్తి అత్యాచారం చేశాడని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మదన్‌బాబుపై పోక్సో కేసు నమోదు చేసి కరీంనగర్ జైల్‌కు తరలించామన్నారు.

84 మందిపై కేసు



డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని రాజీవ్ రహదారి, ఇతర ప్రాంతాల్లో పోలీసులు గురువారం డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రత్యేక వాహన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 84 మంది వాహనదారులపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు, నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న వాహనాలపై 36 కేసులు నమోదు చేసినట్లు అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి తెలిపారు.

కారుణ్యమేది?





ఈ చిత్రంలో కనిపిస్తున్న యువతి పేరు స్వప్న. తండ్రి పేరు నర్సింలు. వీఆర్‌ఓగా రేగోడు మండలంలో విధులు నిర్వర్తించారు. 2020లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఓ వ్యవస్థను రద్దు చేయగానే గుండెపోటుకు గురై మృతి చెందాడు. తండ్రి చనిపోవడంతో కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇప్పించాలని ఈమె తిరగని ఆఫీసు లేదు.. కలవని అధికారి లేరు. ఇందుకు సంబంధించి కొత్త ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో జీవో ఇచ్చింది. కానీ ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీలు లేవని ఇవ్వడం లేదు. జిల్లాలో ఐదుగురు వీఆర్‌ఓలు చనిపోగా వారి కుటుంబాలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

- నిలిచిన పూర్వ వీఆర్‌ఓల కారుణ్య నియామకాలు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధిత కుటుంబాలు
- ఖాళీలు లేవంటూ తిరస్కరణ
- వేరే శాఖల్లో చేస్తున్న వారి జీవితాలు సైతం అగమ్యగోచరం
- గతంలో చేసిన సర్వీస్ గోవిందా

మెదక్‌జోన్: మెదక్ జిల్లాలో 198 మంది వీఆర్‌ఓలు పని చేసేవారు. జిల్లాలో 469 గ్రామాలు ఉండగా ఒక్కో వీఆర్‌ఓ 2 నుంచి 3 గ్రామాలు చూసేవారు. 2020లో వీఆర్‌ఓ వ్యవస్థను రాత్రికి రాత్రే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన విషయం విధితమే. రద్దు చేసి ఏడాది వరకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో మా భవిష్యత్ ఏంటనే బెంగతో ముగ్గురు వీఆర్‌ఓలు గుండెపోటుకు గురై చనిపోయారు. మరో ఇద్దరు ఆరోగ్య సమస్యల కారణంగా చనిపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగి మృతి చెందితే వారి కుటుంబంలో మృతుడి భార్యకు లేదా అతడి పిల్లలకు కారుణ్య నియామకం ద్వారా వారి చదువును బట్టి ఆ స్థాయిలో ఉద్యోగం ఇవాల్సి ఉంటుంది జిల్లాలో చనిపోయిన ఐదుగురు వీఆర్‌ఓల బాధిత కుటుంబాలు కారుణ్య నియామాకాల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

దాదాపు 10 నుంచి 12 ఏళ్ల సర్వీస్

వీఆర్‌ఓ వ్యవస్థ రద్దుతో ఒక్కొక్క ఉద్యోగి 10 నుంచి 12 ఏళ్లపాటు రెవెన్యూలో చేసిన సర్వీస్ అంతా పోయింది. 2022 ఆగస్టులో లాటరీ పద్ధతిన వీఆర్‌ఓలను 24 శాఖల్లో ఏ స్థాయిలో ఖాళీలు ఉంటే అక్కడికి పంపించారు. కానీ వీఆర్‌ఓగా రెవెన్యూ శాఖలో చేసిన సర్వీస్‌ను నూతనంగా వెళ్లిన సర్వీస్‌కు కలుపలేదు. ఫలితంగా ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, సీనియార్టీ పోయిందని ఆవేదన చెందుతున్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం..

సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని పూర్వ వీఆర్‌ఓలు ఇటీవల కలెక్టర్‌ను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అలాగే వివిధ జిల్లాల్లో ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతిపత్రాలను ఇస్తున్నారు. కాగా, గ్రామాలకు మళ్లీ రెవెన్యూ ఉద్యోగులను తీసుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇవ్వడంతో తమను సర్వీస్‌లోకి తీసుకొని గతంలో వీఆర్‌ఓగా చేసిన సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని ప్రమోషన్లతోపాటు రావాల్సిన బెన్‌ఫిట్స్ నిబంధనల ప్రకారం ఇవ్వాలని కోరారు.

పిల్లలు కావడం లేదని ఆత్మహత్య

మునిపల్లి(అందోల్): జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మునిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గురువారం ఏఎస్‌ఐ ఎసయ్య కథనం మేరకు.. కోహీర్ మండలం గురుజాడ గ్రామానికి చెందిన రమేశ్(35)కు మునిపల్లి మండలం బుదేరా గ్రామానికి చెందిన మమతను ఇచ్చి వివాహం జరిపించారు. అప్పటి నుంచి పదేళ్లు గురుజాడ గ్రామంలోనే ఉన్నారు. ఏడాది కిందట బావమరిది మృతి చెందడంతో అత్తగారి ఇల్లు అయినా బుదేరాలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. 12 ఏళ్లుగా పిల్లలు కావడం లేదని బాధపడుతుండేవాడు. మూడు రోజుల కిందట పనికి వెళ్తున్నానని రమేశ్ భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో భార్య మమత బంధువులు, తెలిసిన వారి దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం రాంరెడ్డి బావిలో మృతదేహం తేలడాన్ని గ్రామస్తులు గుర్తించి బుదేరా పోలీసులు, రమేశ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మమత మృతదేహాన్ని గుర్తుపట్టి బోరున విలపించింది. పిల్లలు కావడం లేదని జీవితం పై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వరకట్న వేధింపులకు గృహిణి ..

రామచంద్రాపురం(పటాన్‌చెరు):గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో నివాసం ఉండే అనుష్క ఆయుషీ సింగ్(21) యానిమేషన్ కోర్సు చేస్తుంది. మే నెలలో హైదరాబాద్‌లోని కొండాపూర్ ప్రాంతంలో నివాసం ఉండే హరూన్ పాల్‌తో ప్రేమ వివాహం జరిగింది. వివాహం జరిగిన నాటి నుంచి కట్నం తీసుకురావాలని అత్తింటివారు వేధింపులకు గురి చేశారు. కాగా బుధవారం మధ్యాహ్నం ఆయుషీ సింగ్ విద్యుత్‌నగర్ కాలనీలో నివాసం ఉండే తల్లి ఇంటికొచ్చి కట్నం తేవాలని వేధిస్తున్నట్లు చెప్పింది. గురువారం తల్లి డ్యూటీకి వెళ్లగా సాయంత్రం అనుష్య ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని యువకుడు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొంక రమేశ్ (26) కొద్ది రోజులు హైదరాబాద్‌లో రెండేళ్లపాటు హమాలీ పని చేశాడు. ఏడాది కిందట స్వగ్రామానికి వచ్చి వ్యవసాయంతోపాటు హమాలీ పని చేసుకుంటూ తల్లి దండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అత్తింటి వేధింపులు భరించలేక..



నీరజ (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొక్కొండ తిరుపతికి జగదేవపూర్ మండలంలోని మునిగడపకి చెందిన నీరజ(29)తో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు. కొద్ది రోజుల నుంచి భర్త అదనపు కట్నం తేవాలంటూ వేధించసాగాడు. 20 రోజల కిందట నీరజ తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఈ విషయమై పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడి ఇకపై గొడవపడమని చెప్పి తిరిగి ఇంటికి తీసుకొచ్చాడు. అయినా భర్త తీరు మారకపోవడంతో గురువారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త, అత్త, మామ వేధింపులు తాలలేక తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

పెళ్లి విషయంలో మనస్తాపం చెంది..

ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్య



శ్వేత మృతదేహం

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల విఠల్, శాంతమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. 9 ఏళ్ల కిందట విఠల్ మృతి చెందాడు. అప్పటి నుంచి శాంతమ్మ కుటుంబాన్ని పోషిస్తుంది. పెద్ద కూతురు శ్వేత (16) కొండాపూర్ రెసిడెన్సియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. రేజింతల్ గ్రామానికి చెందిన నట్కారి రమేశ్, శ్వేత ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఈ విషయం ఇరు కుటుంబీలకు తెలియడంతో నెల రోజుల కిందట గ్రామ పంచాయతీ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. శ్వేత మైనర్ అని పెళ్లి వయస్సు వచ్చాక చేసుకోవాలని అప్పటి వరకు ఆమె చదువుకుంటుందని పెద్ద చెప్పవడంతో రమేశ్ ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో 15 రోజుల కిందట కళాశాల నుంచి వచ్చిన శ్వేత ఇంటి వద్దే ఉంటుంది. పెళ్లి విషయంలో మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడింది. మృతురాలి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామానాయుడు వివరించారు.

బాలికపై అత్యాచారం?

నంగునూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. బాలిక తల్లి దండ్రులు రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బాలికతో మాట్లాడిన పోలీసులు సిద్దిపేటలోని భరోసా కేంద్రంలో చేర్పించినట్లు సమాచారం. కాగా బాలికపై యువకుడితోపాటు మరో ఇద్దరు అత్యాచారానికి పాల్పడినట్లు ప్రచారం జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై రాజగోపాలపేట పోలీసులను సంప్రదించగా బాలిక తప్పిపోయినట్లు బుధవారం రాత్రి ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని బీరంగూడ వందనపురి కాలనీకి చెందిన చాకలి రాజు ప్రైవేటు ఉద్యోగి ఈ నెల 5వ తేదీన తిరుపతి దర్శనానికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి అదే రోజు విమానంలో తిరుపతి వెళ్లాడు. మరుసటి రోజు మధ్యాహ్నం ఫోన్ చేసి అయోధ్యలో ఉన్నానని, దర్శనం చేసుకొని హైదరాబాద్‌కు చేరుకుంటానని తెలిపాడు. తర్వాత అతనికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు రాజు కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో రాజు భార్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మానవత్వం చాటారు



నర్సింలును ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు



బంగారాన్ని అందజేస్తున్న 108 సిబ్బంది

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన నర్సింలు (45) ఆర్టీసీ కొత్త బస్టాండ్ సమీపంలో గురువారం ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడిపోవడంతో తలకు గాయమైంది. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఏఎస్‌ఐ ఉమేశ్, సిబ్బంది గమనించి వెంటనే స్పందించి గాయపడిన అతడిని ఆటోలో సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అతడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకొని ఆస్పత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

బంగారం అందజేసిన 108 సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి సురక్షితంగా ఆస్పత్రికి చేర్చడమే కాకుండా అతడి వెంట తీసుకెళ్తున్న బంగారాన్ని భద్రంగా బంధువులకు అప్పగించారు 108 సిబ్బంది. వివరాల్లోకి వెళ్తే.. హత్నూరకు చెందిన వినోద్ పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలో ఉన్న ఎంఎస్‌ఎన్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై హత్నూర వెళ్లేందుకు పటాన్‌చెరు వైపు జాతీయ రహదారిపై వస్తున్నాడు. ఇస్నాపూర్ బంగారం దుకాణంలో తొమ్మిది తులాల ఆభరణాలు కొనుగోలు చేసి వెంట తీసుకొని వెళ్తున్నాడు. పటాన్‌చెరు మండలం లక్డారం గేటు సమీపానికి రాగానే లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్‌కు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. 108 సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అతడి వద్ద ఉన్న బంగారాన్ని 108 సిబ్బంది ప్రశాంత్ భద్రపరిచి వినోద్ కుటుంబ సభ్యులకు అందించాడు.

రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

సిద్దిపేటరూరల్: ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అమ్మన చంద్రారెడ్డి మాట్లాడుతూ.. నగదు రహిత చికిత్స విధానం ఈహెచ్‌ఎస్ 1 శాతం కాంట్రిబ్యూషన్‌తో వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఆర్‌లను విడుదల చేయాలన్నారు. అదే విధంగా కమ్యుటేషన్ కాలాన్ని 15 ఏళ్ల నుంచి 12 ఏళ్లకు తగ్గించి పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్.రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ఇతర జిల్లా బాధ్యులు, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



రేఖ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చెప్యాలలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరుశరాములు కథనం మేరకు.. గ్రామానికి చెందిన మర్రిపల్లి రేఖ (42) కూలీ నాలీ చేసుకుంటూ 18 ఏళ్లలోపు ఇద్దరు పిల్లలు శ్రద్ధ, ముకేష్‌లను పోషించుకుంటోంది. గురువారం ఉదయం మిషన్ భగీరథ నల్లాకు మోటారు పైపు కనెక్షన్ వైర్లు పెడుతుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు మృతి చెందింది. నాలుగు నెలల కిందట రేఖ భర్త వెంకటేశ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. నెలల వ్యవధిలో తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. మృతురాలి కూతురు శ్రద్ధ పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రేగోడ్‌లో పాముకాటుతో..



రాములమ్మ (ఫైల్)

రేగోడ్(మెదక్): పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గజ్వా డ గ్రామంలో గురువారం జరిగింది. కుటుంబీకులు, గ్రామస్తుల కథనం మేరకు.. గజ్వాడ గ్రామానికి చెందిన రాములమ్మ (45), భర్త మల్లేశం ఇద్దరూ వ్యవసా యం చేస్తున్నారు. రోజూ మాదిరిగానే చేనుకి వెళ్లి పని చేస్తుండగా మధ్యాహ్నం సమయంలో రాములమ్మను పాము కాటేసింది. అక్కడే ఉన్న భర్త మల్లేశం స్థానికులతో కలిసి రేగోడ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

వాగులో మునిగి బాలుడు..



విష్ణువర్ధన్(ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): వాగులో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామానికి చెందిన బాలుడు విష్ణువర్ధన్(9) అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాల టైర్లతో ఆడుకుంటూ గ్రామ శివారులోని వాగు వద్దకు వెళ్లాడు. టైర్లను కడుగుతూ వాగులోకి దిగడంతో ప్రమాదవశాత్తు అందులో మునిగిపోయాడు. అక్కడు ఉన్న మరో బాలుడు అరవడంతో గ్రామస్తులు వచ్చి విష్ణువర్ధన్‌ని పైకి తీసేసరికి మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి..

గజ్వేల్‌రూరల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని బయ్యారం చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(సింగారం)కి చెందిన ననుబాల కిష్టారెడ్డి(45) గజ్వేల్ మండల పరిధిలోని కొల్గూరు గ్రామంలో కుటుంబ సభ్యులతో నివాసముంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. వ్యవసాయ పనిముట్టుకు మరమ్మతు చేయించేందుకు టీవీఎస్ ఎక్సెల్‌పై గజ్వేల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా బయ్యారం చౌరస్తా వద్ద వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే కిష్టారెడ్డి మృతి చెందినట్లు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చేతి వృత్తులకు చేయూత

పీఎం విశ్వకర్మ యోజనతో లబ్ధి

- 18 రకాల వృత్తులకు అవకాశం
- కొత్తగా మరోసారి దరఖాస్తులు స్వీకరణ
- జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు వచ్చినవి 3,598

మెదక్ కలెక్టరేట్: సాంకేతిక యంత్ర పరిశ్రమలు పెరుగుతున్న తరుణంలో చేతి వృత్తులకు ఆదరణ కరవవుతుంది. దీంతో చేతివృత్తులపై ఆధారపడిన ప్రజలు ప్రత్యామ్నాయం వైపు వెళ్ల లేక, ఉపాధి కరువై అవస్థలు పడుతున్నారు. అలాంటి వారిని ఆదిరించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని 2023 సెప్టెంబర్‌లో ప్రవేశ పెట్టింది. చేతి వృత్తులు, సంప్రదాయ సాధనాలపై ఆధారపడిన కళాకారులకు సమగ్ర సహాయాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించారు. రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఈ పథకం అమలుకు నోచుకోలేదు. ఇటీవల మరోసారి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటన చేసింది.

లక్ష్యం

ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న చేతి వృత్తిదారులకు సులభతర రుణాలు అందించడంతోపాటు అవసరమైన వారికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, ఆధునిక యంత్ర పరికరాలు అందిస్తారు. అలాగే డిజిటల్ లావాదేవీల కోసం ప్రోత్సాహకాలను అందిస్తారు. ఆధునిక మార్కెట్‌లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి సమగ్ర మద్దతును అందిస్తూ.. సాంకేతికతతో కళాకారులను సన్నద్ధం చేయడం జరుగుతుంది.

ఎలా దరఖాస్తు చేసుకోవాలంటే..

పీఎం విశ్వకర్మ పోర్టల్‌లో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్‌తో కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా లబ్ధిదారులు నమోదు చేసుకోవాలి. లబ్ధిదారుల నమోదు తర్వాత మూడు–దశల వెరిఫికేషన్ ఉంటుంది. గ్రామ పంచాయతీ, మండల స్థాయి, జిల్లా అమలు కమిటీ పరిశీలన, సిఫార్సు స్క్రీనింగ్ కమిటీ ఆమోదం చేయాల్సి ఉంటుంది.

పథకానికి అర్హత..

18 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులు, అసంఘటిత రంగంలో కుటుంబ–కేంద్రీకృత సాంప్రదాయ వ్యాపారాల్లో నైపుణ్యం లేదా చేతివత్తుల పనిలో నిమగ్నమై ఉన్నవారు, స్వయం ఉపాధి పొందిన వ్యక్తులుగా విశ్వకర్మ పథకం ద్వారా సహాయం పొందేందుకు అర్హులు.

స్వయం ఉపాధికి రుణం

నైపుణ్య శిక్షణను పూర్తి చేసిన చేతి వృత్తుల వారికి 18 నెలల కాల పరిమితితో చెల్లించే విధంగా ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ. లక్ష వరకు రుణం పొందవచ్చు. అధునాతన నైపుణ్యం కలిగిన లబ్ధిదారులకు రూ. 2 లక్షల వరకు రెండో విడత రుణాలను పొందవచ్చు.



18 రకాల వృత్తులు

ప్రస్తుతం పథకంలో 18 వృత్తులను చేర్చారు. కార్పెంటర్, బోట్ మేకర్, ఆర్మర్, కమ్మరి, హామర్ అండ్ టూల్ కిట్ మేకర్, తాళాలు వేసే వారు, అవుసుల, కుమ్మరి, శిల్పి (రాతి చెక్కేవారు), రాళ్లు కొట్టే వడ్డెరలు, చెప్పులు కుట్టేవారు, తట్టలు, బుట్టలు, చాపలు, చీపుళ్లు తయారు చేసేవారు, సాంప్రదాయ బొమ్మలు చెక్కేవారు, మంగళి, చాకలి, దర్జీ, మత్స్యకారులు తదితర రకాల వృత్తుల వారు అర్హులు.



సర్టిఫికెట్లు

ఈ పథకంలో హస్తకళాకారులు వారి సంబంధిత చేతి వృత్తుల్లో వారి నైపుణ్యాన్ని గుర్తించి పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డును అందజేస్తారు. అలాగే అవసరమైన వారికి ఆధునిక పనిముట్లు కొనుగోలు చేసుకునేందుకు రూ.15 వేలు అందజేస్తారు.

శిక్షణలో రూ.500

ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు 7 రోజుల పాటు ప్రాథమిక శిక్షణ, 15 రోజులు అధునాతనమైన శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలో అభ్యర్థుల ఖర్చు నిమిత్తం ప్రతిరోజూ రూ.500లు అందజేస్తారు. అధునాతన శిక్షణ అంశాలు, పరిశ్రమ భాగస్వాములతో అను సంధానాలు కల్పించి స్వీయ ఉపాధి నుంచి సంస్థలను స్థాపనకు మార్చడానికి వీలుకల్పిస్తారు.

ఇప్పటి వరకు 3,598 దరఖాస్తులు



జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,598 మంది దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ పంచాయతీల నుంచి 2,717, అర్బన్ ప్రాంతాల నుంచి 881 దరఖాస్తులు వచ్చాయి. పరిశ్రమల శాఖకు 1,573 దరఖాస్తులు అందాయి. మిగితా దరఖాస్తులపై సంబంధిత అధికారులు పరిశీలన చేస్తున్నారు. ఇటీవల కలెక్టర్‌తో కూడిన కమిటీ పీఎం విశ్వకర్మ పథకంపై సమావేశం నిర్వహించారు. కమిటీ ఆదేశాల మేరకు తమకు వచ్చిన దరఖాస్తులను స్టేట్‌కు పార్వడ్ చేస్తున్నాం. వంశపారపర్యంగా వృత్తి చేస్తున్న దర్జీలు, మేస్త్రీలు మాత్రమే ఈ పథకానికి అర్హులు, ఇటీవల ట్రెనింగ్ పొందిన వారికి పథకం వర్తించదు.

– కృష్ణమూర్తి, జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్